

పెద్దదర్గాను సందర్శించిన 'పద్మవ్యూహం' నటులు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోనిపెద్ద దర్గాను పద్మ వ్యూహం సినిమా హీరో ప్రవీణ్ రాజ్, హీరో యిన్ షితల్ శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ప్రతినిధి అమీర్ దర్గా సంప్రదాయం ప్రకారం సన్మానించారు. దర్గాలోని ప్రధాన మాజార్ల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేయించి ప్రతిష్టను వారికి వివరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరిగిందని, దర్గా గురించి తెలిసి ఇక్కడికి వచ్చామని పేర్కొన్నారు. దర్శించిన తర్వాత మనసుకు ప్రశాంతత కలిగిందని చాలా సంతోషంగా ఉందని తెలిపారు.



ప్రార్ధన నిర్వహిస్తున్న హీరో, హీరోయిన్

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణి మానుకోవాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి మానుకోవాలని తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో ప్రచారం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా వేధింపులకు గురిచేస్తున్నారని ఇది సరైన పద్దతి కాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రివర్స్ పిఆర్‌సి వద్దని ఉపాధ్యాయులు ఉద్యమం చేసినప్పటి నుండి ఈ వేధింపులు మొదలు పెట్టారన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చి నేడు సాధ్యం కాదని జిపిఎస్ అంటూ కొత్త పల్లవి ఎత్తుకున్నారు. దేశంలోని ఆరు రాష్ట్రాల్లో సిపిఎస్ రదు చేయగాలేనిది ఇక్కడ ఎందుకు సాధ్యం కాదన్నారు. సిపిఎస్ రద్దయ్యే వరకూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం పరిధిలో లేని ఎన్నికల విధుల నుండి ఉపాధ్యాయులను తప్పిస్తున్నట్లు ఉత్తర్వులు ఇవ్వడం హాస్యాస్పదమని తెలిపారు. కెజిబివిలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అరకొర జీతాలు పెంచడం కాదు, ఆ స్కూల్స్‌కు రెగ్యులర్ పోస్టులు కేటాయించి రెగ్యులర్ టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో మీ గళం వినిపించే అవకాశం మీ మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి నన్ను గెలిపించడం ద్వారా చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, జెవివి జిల్లా ట్రెజరర్ ఎస్.చంద్ర, చేనేత కార్మిక సంగం జిల్లా కార్యదర్శి ఎస్.శేషాద్రి పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

హార్సిలీహిల్స్‌లో పోలీస్ అవుట్ పోస్టు ప్రారంభం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. ఈ పోలీస్‌స్టేషనును శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ దేశం నలు మూలల నుండి పర్యాటకులు హార్సిలీహిల్స్‌కు విచ్చేసి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారన్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామన్నారు. ఇకపోతే పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాలన్నారు. పోలీస్ స్టేషనుకు వచ్చే ఫిర్యాదుదారులను మర్యాదగా పలకరించాలని పేర్కొన్నారు. వారి ఫిర్యాదులను తీసుకొని, విచారణకు సహకరించాలన్నారు. కేసుల దర్యాప్తులో పారదర్శకంగా వ్యవహరించి, అసలు దోషులకు శిక్షపడే విధంగా చూసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెక్ పోస్టులందు ప్రత్యేక నిఘా ఉంచి ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీ, విక్రయాలపై దృష్టి సారించాలన్నారు. 96 గ్రామాల్లో నాటుసారా విక్రయాలు, వినియోగం ఉందని గుర్తించామన్నారు. మూడు నెలలుగా నాటుసారా కేసులు తక్కువగా నమోదు కావడం హర్షణీయమని పేర్కొన్నారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.ఇక జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే 60 హాట్ స్పాట్లను గుర్తించామని, అక్కడ పోలీసులను ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మదనపల్లి డిఎస్‌పి కేశప్ప, రూరల్ శివాంజనేయులు, ఎస్ఐ రామ్మోహన్, పోలీస్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ నాయక్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, పర్యాటక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ అవుట్ పోస్టును పరిశీలిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజల చెంతకు అభివృద్ధి ఫలాలు : 'ఆకేపాటి'

ప్రజాశక్తి-వీరబల్లి

దేశంలో ఏరాష్ట్రంలో చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజల చెంతకే చేరుతున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉమామహేశ్వరరాజు, గాలివీటి వీరనాగిరెడ్డి అధ్యక్షతనమ గృహ సారధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలనను క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గత ప్రభుత్వాల్లో వందల పేజీల మేనిఫెస్టోలును రూపొందించి రెండు పేజీలు కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 94 శాతంకుపైగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం గృహ సారధుల కిట్లును కొత్తగా నియమితులైన మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి నరేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలికులు కృష్ణమూర్తి, మాజీ ఎంపిపి విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, మండల కన్వీనర్ ఉమామహేశ్వరరాజు, విఆర్ విద్యా సంస్థ అధినేత విఆర్ రెడ్డి, జడ్‌పిటిసి శివరాం గౌడ్, సర్పంచులు, ఎంపిటిసిలు, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారదులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం : 'గడికోట'



జగనన్న కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిజం చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లి మండలం గుణ్ణికుంట్ల గ్రామంలోని జాందీగారిపల్లె, చౌటపల్లెలకు సంబంధించి జగనన్న కాలనీలో నిర్మాణాలలో ఉన్నగృహాలను శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో పూరిగుడిసె లేకుండా చేయడం జరిగిందన్నారు. తండ్రి స్ఫూర్తితో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశచరిత్రలో ఎవ్వరూ చేయనివిధంగా పేదలందరికీ ఇళ్ల స్థలాలను సేకరించి, ఆ ఇళ్ల పట్టాలను అత్యంత పారదర్శకంగా పంచి, వేగంగా ఇళ్ల నిర్మాణాలును జగనన్న ప్రభుత్వం జరిపిస్తోందని పేర్కొన్నారు. ఇళ్లు కాదు అవి ఊళ్ళు అనిపించేలా కాలనీలును ఆదర్శవంతంగా నిర్మించడం జరుగుతోందన్నారు. ఆయా కాలనీల్లో ఇళ్లతో పాటు తాగునీరు, సిమెంట్ రహదారులు, డ్రెయినేజీలు, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. పట్టణ సమీపంలోని గుణ్ణికుంట్ల గ్రామంలోనే 95 గృహాలు మంజూరు అయ్యాయని, నిర్మాణాలు వివిధ దశల్లో ఉండడం హర్షదాయకమన్నారు. సంబేపల్లె మండలంలో 17 జగనన్న కాలనీలలో పక్కా గృహాల నిర్మాణాలు చురుగ్గా సాగుచున్నాయన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రత్నాలను రాశులుగా పోసి అమ్మిన ఘన చరిత్ర కలిగిన విజయ నగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు అందరివాడని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, జెఎసి కన్వీనర్ వై.ఎస్.మునిరత్నం పేర్కొన్నారు. స్థానిక బసినికొండ వై జంక్షన్‌లో శుక్రవారం భూమి శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ నిర్వహించారు. కత్తి రాజు, శ్రీకృష్ణదేవరాయ (బలిజ) జెఎసి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పోకల అశోక్ కుమార్, ఆకుల గజేంద్ర, సాయి లోకేష్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. జెఎసి కన్వీనర్ వైఎస్ మునిరత్నం అధ్యక్షతన జరిగిన భూమిపూజ కార్యక్రమంలో రేగడి ప్రసాద్ కుమార్ గుండాల రామచంద్ర, ఆకుల కృష్ణమూర్తి, కత్తి లక్ష్మన్న, బోర్‌వెల్ నాగరాజ, అండే శివ ప్రసాద్, రామచంద్ర, ఆంజనేయ కుమార్, నరేంద్ర, జయరామ్, బలపా వెంకటరమణ, కత్తి రాజు, జంగాల శివరామ్ రాయల్, నట శేఖర్, చంద్రశేఖర్, కొండయ్య పాల్గొన్నారు. అంతకు ముందు బలిజల ఐక్యత చాటుతూ పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.



పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న బలిజ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

1న జీతాలు చెల్లించేలా చట్టం తేవాలి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లించే చట్టం తేవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాయచోటి తాలూకా అధ్యక్షులు సాయికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగుల జీతాలు, చెల్లింపులు, చట్టబద్ధత గురించి చర్చ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగస్తులకు 10వ తేదీ అయినా జీతాలు పడడంలేదన్నారు. సరెండర్ లీవ్, జిపిఎఫ్ ఊసేలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర అధ్యక్షులు సూర్య నారాయణ తీసుకొనే భవిష్యత్తు కార్యాచరణ గ్రామాలు, మండలాలలోని ఉద్యోగుల పూర్తి మద్దతుఉంటుందని పేర్కొన్నారు. తాలూకా కార్యదర్శి సుజిత్ మాట్లాడుతూ పెన్షనర్ల జీతాలు ఇంతవరకు పడడంలేదు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు పడేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లికార్జున, శ్రీనివాసులు నాయక్ ,రమణ సంయుక్త కార్యదర్శి వలి, శివ రాజశేఖర్, హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైసిపి మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వెన్నపూస రవీంద్రారెడ్డి కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహ్మాన్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనంతగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించడంలో ముఖ్యమంత్రి మొదటి స్థానంలో ఉన్నానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అన్నా సలీం, సుగవాసి శ్యామ్, అన్నమయ్య జిల్లా కార్యదర్శి గూటం రాము, కొత్తపల్లి ఇంతియాజ్, అజ్మతుల్లా, దివాకర్‌రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, బేపారి జబివుల్లా పాల్గొన్నారు.

ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో శ్రీయోగ బోగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం కన్నుల పండువలా జరిగింది. ఆలయం ప్రధాన అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుండే పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, స్వామి వారి భక్తులు హాజరై స్వామి వారి కృపా కటాక్షానికి పాత్రులు అయ్యారు. ధ్వజస్తంభం బలిపీఠం కీర్తిశేషులు జి.నారాయణప్ప జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, జి.భాస్కర్, భానుతేజ, విశ్వేశ్ ఏర్పాటు చేశారు. బాహ్యానంది మండపం మార్పురి భాస్కర్ నాయుడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిర్మాణానికి సహకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ శ్రీయోగ భోగేశ్వర స్వామి ఆలయంలో 200 సంవత్సరాల వయసు కలిగిన వక్ష్మిబుక్షాన్ని తీసుకువచ్చి ధ్వజస్తంభం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు మురళీ శర్మ, స్వామివారి భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న అర్చకులు



ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

అత్తిరాల బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అత్తిరాల శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే కల్యాణోత్సవం, బ్రహ్మ, రథోత్సవాలకు సంబంధించిన ప్రచార పత్రాలను శాసనసభ్యులు మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి శుక్రవారం బైపాస్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో అత్తిరాల దేవాలయం చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, మందరం వేణుగోపాల్‌రెడ్డి, మందరం గంగిరెడ్డి, పాలగిరి మల్లిఖార్జునరెడ్డి, సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఒంటిమిట్ట సచివాలయం కన్వీనర్ ఇన్‌ఛార్జి రఘురాంరెడ్డి పాల్గొన్నారు.


19న నాటక ప్రదర్శనలు

మహాశివరాత్రి సందర్భంగా అత్తిరాలలో రాజంపేట శ్రీ అన్నమయ్య కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పౌరాణిక విభిన్న రంగస్థల నాటక భక్తిరస ప్రదర్శనలను ప్రముఖ కళాకారులచే ప్రదర్శించనున్నారని అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, ఆలయ చైర్మన్ వెలగచర్ల వెంకట సుబ్బారెడ్డి, దేవస్థాన ఎగ్జిక్యూటివ్ అధికారి కొండారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 19వ తేదీ రాత్రి శ్రీరామాంజనేయ యుద్ధం, చింతామణి నాటకం నుండి భవానీ సన్నివేశం, శ్రీకృష్ణ రాయబారం, బాలనాగమ్మ నాటకం నుండి కార్యవర్ధి సన్నివేశం వంటి ప్రదర్శనలతో పాటు సత్య హరిశ్చంద్ర పూర్తి నాటకాన్ని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. నాటక ప్రదర్శనలకు నియోజకవర్గంలోని ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

'విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలి'

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థుల అభ్యసనంలో అభివృద్ధికి బోధనతోపాటు సాధనకు కూడా సమప్రాధాన్యత ఇవ్వాలని డైట్ లెక్చరర్ వైసి.రెడ్డెప్పరెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న అభ్యసనా అభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. కోవిడ్ కారణంగా పాఠశాలలు చాలా రోజులుగా మూతపడి ఉండడంతో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రతికూల ప్రభావం పడిందన్నారు. గత తరగతులలో నేర్చుకున్న అంశాలలో కూడా వెనకబడ్డారన్నారు. ఈ కారణం చేత ప్రభుత్వం విద్యార్థులలో కనీస విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి లిప్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడానికి ప్రారంభ పరీక్ష, నెలవారి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షలలో విద్యార్థులు చూపిన ప్రతిభ ఆధారంగా వారిని గ్రేడులుగా విభజించి వెనుకబడిన పిల్లలకు ప్రత్యేకంగా బోధించాలన్నారు. మార్చి చివరినాటికి విద్యార్థులందరూ చదవడం, రాయడం, అంకగణితములందు సంపూర్ణ సామర్థ్యాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, డిస్టిక్ రిసోర్స్ పర్సన్ శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ రెడ్డెప్పరెడ్డి



బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


'వీరభద్రుని ఖ్యాతి మరింత పెంపొందించాలి'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బ్రహ్మోత్సవాల నిర్వహణతో దక్షిణ కాశీగా పేరుపొందిన రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయ ఖ్యాతి మరింత పెంపొందాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ నెల 15 నుండి 25వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ పోలంరెడ్డి విజయతో కలసి శ్రీకాంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవకులు, దాతల సహకారం, సమన్వయంతో బ్రహ్మోత్సవాలును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ రమణారెడ్డి, కమిటీ సభ్యులు సురేష్, రత్నశేఖర్‌రెడ్డి, నాగభూషణం, సర్పంచ్‌లు రామాంజులు, నాగార్జున ఆచారి, నాయకులు చలమారెడ్డి, రఘు పాల్గొన్నారు.

తహశీల్దారుగా ప్రేమంత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

రాయచోటి : తహశీల్దార్‌గా ఎస్.ప్రేమంత్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ రవిశంకర్‌రెడ్డి డిప్యూటీ కలెక్టర్‌గా కడపకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రేమంత్ కుమార్ మాట్లాడుతూ తాను కె.వి.పల్లె మండలం నుండి ఇక్కడ బదిలీ అయ్యానని పేర్కొన్నారు. చిన్నమండెంలో కూడా గతంలో తహశీల్దార్‌గా పనిచేసినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



తహశీల్దార్ ప్రేమంత్‌కుమార్

జాబ్‌మేళాకు అపూర్వ స్పందన

పెద్దఎత్తున తరలివచ్చిన నిరుద్యోగులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం శుక్రవారం పట్టణంలోని బిటి కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. ఈ మెగా జాబ్ మేళాకు బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నుండి దాదాపు 90 కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు కంపెనీలో ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా వివిధ ప్రాంతాల్లో ఇటువంటి జాబ్ మేళాలను ఏర్పాటు చేస్తోంది. బిటి కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి జాబ్ మేళాకు విచ్చేసిన నిరుద్యోగ అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ జాబ్ మేళాను విజయవంతం చేసిన పలు కంపెనీల ప్రతినిధులకు, కళాశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పశుసంవర్ధక భవన నిర్మాణ పనులపై విచారణ

ఎసిబి డిఎస్‌పి, ఎస్ఐ రికార్డుల పరిశీలన

రూ.4 కోట్ల పనుల అసంపూర్తిపై ఆరా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పశుసంవర్ధక శాఖ పాలీవెటర్నరీ క్లినిక్ భవన నిర్మాణ పనులపై ఎసిబి దృష్టి సారించింది. 2016-17 సంవత్సరంలో ప్రభుత్వం నాబార్డు సౌజన్యంతో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రూ.4 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టింది. 2022 నాటికి గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణ పనుల్ని పూర్తి చేసింది. మిగిలిన మూడు, నాలుగు అంతస్తుల పనుల్ని పూర్తి చేయడానికి నిధుల కొరత పేరుతో వదిలేసింది. జిల్లా పశు సంవర్ధక శాఖలో అడిషనల్ డైరెక్టర్ల మధ్య విభేదాలు రావడంతో రచ్చకెక్కింది. ఫిర్యాదుల వెల్లువెత్తిన కారణంగా విజయవాడ ఎసిబి డిఎస్‌పి ఆధ్వర్యంలోని బృందం రహస్యంగా విచారించినట్లు సమాచారం. ప్రస్తుత ఎడి అచ్చెన్నను విపిసి భవన నిర్మాణ పనుల్లోని ఎలక్రిఫికేషన్, వుడ్, నాసిరకపు క్వాలిటీ వంటి అంశాలను ఆరాతీయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు ఎడిల మధ్య నెలకొన్న విబేధాల కారణంగా నలుగురు ఉద్యోగుల సరెండర్స్, ఎస్‌సి, ఎస్‌టి కేసుల వంటి ఘటనలకు అదనంగా ఎసిబి విచారణ వ్యవహారం చేరడంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా తయారైంది. కర్నూలు, హిందూపురం పట్టణాల్లో విపిసి భవన నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు సమాచారం. కడపలో విపిసి భవన నిర్మాణ పనులు ఎందుకు పూర్తి చేయలేదని, నాసిరకపు పనుల నిర్మాణాలకు బాధ్యులు, అసంపూర్తి నిర్మాణ పనుల సమయంలో స్వాధీనం చేసుకున్న పశుసంవర్ధకశాఖ అధికారులు ఎవరు, ఎందుకు స్వాధీనం చేసుకోవాల్సి వచ్చిందనే అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. విపిసి భవన నిర్మాణ పనులు జరుగుతుండగా అప్పటి జెడి సత్యప్రకాష్, ఎడిలుగా శ్రీధర్‌కుమార్‌లకు గల ఆసక్తి, అవసరం ఏమిటనే కోణంలో విచారించినట్లు సమాచారం. దీనిపై త్వరలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



నేడే జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10. 30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి సి.ఎస్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 25 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కడప5, ప్రొద్దుటూరు5, రాయచోటి 3, రాజంపేట 2, బద్వేల్ 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 08562 258622, 244622కు districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com ద్వారా గాని సంప్రదించవచ్చునని తెలిపారు. కోవిడ్-19 నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ రామనాథన్

ఆన్‌లైన్ శిక్షణలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట

మండల పరిధిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబిఎ విద్యార్థులకు సర్టిఫికేట్ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ ఇన్ మేనేజ్‌మెంట్, ఇతర టాపిక్స్‌లో ఆసియా యూనివర్సిటీ, తైవాన్ వారు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో 25 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షలో ప్రతిభ కనపరిచిన 49 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారని కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ తెలిపారు. విద్యార్థులకు ప్రస్తుతం మన ప్రపంచంలో జరుగుతున్న నూతన టెక్నాలజీ లను దృష్టిలో ఉంచుకొని, ఎంబిఎ విద్యార్థులకు అవసరమైన శిక్షణను అందజేశారని తెలిపారు. ఎన్‌రోలిమెంట్‌లో ప్రతిభ కనపరిచిన వారికి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ఈశ్వర్, విభాగాధిపతి డాక్టర్ శ్రీమంతకుమార్ పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలం లోని అన్ని యాజమాన్యముల పాఠశాలలు శనివారం యథావిధిగా పనిచేయాలని డిఇఒ వై.రాఘవరెడ్డి ఆదేశించినట్లు ఎంఇఒ రాజగోపాల్ తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2023 జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా అదనంగా ఒక్క రోజు సెలవుగా ఉపయోగించుకోవడం జరిగిందన్నారు. అందుకుగాను ఫిబ్రవరి 11వ తేదీ రెండోవ శనివారం యథావిధిగా పాఠశాలలు పనిచేయాలని డిఇఒ ఆదేశించినట్లు తెలిపారు. వారి ఆదేశాను ప్రతి ఉపాధ్యాయుడు పాటించాలని, శనివారం యథావిధిగా పాఠశాలలు కొనసాగించాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఇఒ రాజగోపాల్

మండల పరిధిలోని సింగం వారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఎంఇఒ రాజగోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని అన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన నిర్వాహకులు అందిస్తున్న భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా విలువలతో కూడిన నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించినప్పుడే విద్యార్థులు మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో సమాజంలో జీవించగలరని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్‌బాషా పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-కలకడ

శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త వంగిమల్ల ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. కె.వి.పల్లి మండలం మహల్‌రాజుపల్లె పంచాయతీ ఎగువరావిళ్లలో వెలసిన వెంకటేశ్వర స్వామికి అర్చకులు, అభిషేకాలు నిర్వహించామన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, వైసిపి నాయకులు ఉదయభాస్కర్, రెడ్డప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ నియంత్రిక

ప్రజాశక్తి-ములకలచెరువు



తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ నియంత్రిక

మండలంలోని మద్దయ్యగారిపల్లె గ్రామంలో విద్యుత్ నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. ప్రక్కనే ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, మరోప్రక్క జన నివాసాలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రిక మూడు అడుగుల ఎత్తులో ఉన్న దిమ్మె పై అమర్చారు. ఉపకేంద్రానికి వచ్చే రోగులు, చిన్న పిల్లలు ఎవరైనా నియంత్రికను తాకే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులకు విన్న వించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజంపేట అర్బన్ : పట్టణంలోని చెట్లు తొలగించే కార్య క్రమంతో పాటు మర మ్మతులు చేపట్టే కార్య క్రమం ఉండటం వల్ల తాళ్లపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లె, సరస్వతీపురం, బావికా డపల్లె, రెడ్డిపల్లె, కొండూరు, పెనగలూరు, టిజిపల్లె, బెస్తపల్లె సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సర ఫరా నిలిపివేయ నున్నట్లు డిఇఇ ఎం.సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జడ్‌పి హైస్కూల్లో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ వై.రాఘవరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మదనపల్లి డివైఇఒ కృష్ణప్ప తో కలిసి పాఠశాలలోని తరగతి గదులను, రికార్డులను, నాడు నేడు పథకం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల సాధారణ తనిఖీల్లో భాగంగా నిమ్మనపల్లి జడ్పి హైస్కూల్ ను పరిశీలించడం జరిగిందన్నారు. సుమారు 500 మంది పైగా ఇక్కడ విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. త్వరలో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ఉత్తమ ఫలితాలు సాధించటానికి పాఠశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ విద్యను బోధిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పాఠశాలలోనూ పదవ తరగతి పరీక్ష లో ఉత్తమ ఫలితాలు సాధించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు విధి నిర్వహణలో భాగంగా పాఠశాల కార్యక్రమాలను సమన్వయంతో, కలసికట్టుగా చేయాలని సూచించారు. ఇక్కడ హెచ్‌ఎం శ్రీదేవి పాఠశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలో పనుల బాగా జరుగుతున్నాయని వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి డివైఇఒ కృష్ణప్ప, ఎంఇఒ రాజగోపాల్, హెచ్‌ఎం శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం శ్రీదేవితో మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ వినయ్ బాబు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-వీరబల్లి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారులు వినయ్ బాబు, పవన్ కుమార్, బిందు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో బాగంగా విచ్చేసిన గర్భవతులుకు శశి ఫౌండేషన్ ద్వారా అందచేసిన పౌష్టికాహారం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా విదేశాలలో ఉంటూ సొంత మండలంలోని గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలని విలువలతో కూడిన పౌష్టికాహారం అందచేయడం అభినందదగ్గ విషియం అన్నారు. గైనకలజిస్ట్ బిందు మాట్లాడుతూ గర్భస్థ సమయంలో ఆహారం పట్ల, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియ జేశారు. విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల 9,10వ తేదీలలో గర్భిణులకు దాతల సహాయంతో పౌష్టికాహారం పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో తుమ్మల రమేష్, సిహెచ్‌ఒ సుధాకర్, లాబ్ టెక్నిషియన్ కల్పన, వైద్య సిబ్బంది గంగులమ్మ, సుబ్బయ్య, ఆశాలు, ఎన్ఎంలు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ అధికారులతో మండల వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయపరమైన అవసరాలు గురించి సూచనలు, సలహాలు అందజేశారు. రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుక వస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు ఎడిఎ కవిత, వెటర్నరీ డాక్టర్ సుదీష్, సలహా మండలి సభ్యులు మండల రైతు భరోసా కేంద్ర అధికారులు పాల్గొన్నారు.

కెవికె సమన్వయకర్తగా పాండురంగ

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రం నూతన సమన్వయకర్తగా డాక్టర్ జి.ఎన్. పాండురంగ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో కీటక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పని చేశారు. ఇప్పుడు బదిలీ పై కెవికె, కలికిరికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇంతకు ముందు వ్యవసాయ పరిశోధన స్థానం ఆముదాల వలసలో కీటక శాస్త్రం శాస్త్రవేత్తగా పని చేసినట్లు తెలిపారు. నూతన సాంకేతికత పరిజ్ఞానాన్ని రైతులకు చేరేలా చూస్తానని, కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిని అభివృద్ధి మార్గంలో నడిపిస్తానని తెలిపారు. ఇక్కడ పనిచేసిన డా.ఎంకె.జ్యోత్స్న తిరుపతి వ్యవసాయ కళాశాలకు బదిలీపై వెళ్ళినట్టు తెలిపారు.

జీతాలు చెల్లించక పోవడం కక్ష సాధింపే..!

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దేశ సగటు వృద్ధి 24.8 శాతం కన్నా 26.2శాతం తో గాడిన పడితే, రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు జీతాలు ఇంతవరకు చెల్లించకపోవడం ఉద్యోగుల పై కక్ష సాధింపు చర్యలు కాదా అని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను పర్యటించి విద్య,ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి గా విఫలం చెందినదని అన్నారు. పదవ తేదీ అవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు జీతాలు ఇవ్వకపోవడం చాలా దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై. సుబ్రమణ్యం రాజు, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు వెంకట రమణయ్య, సనావుల్లా పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట పనులు పరిశీలన

తంబళ్లపల్లి : మండలంలో విద్యాభివృద్ధికి చేయూతనిస్తున్న దాత మల్లయ్య కొండ మాజీ చైర్మన్ కనుగొన్న మద్దిరెడ్డి శుక్రవారం కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాల, మోడల్‌స్కూల్‌లను సందర్శించారు. రెండు చోట్ల సరస్వతీ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు తన సొంత నిధులతో పనులు చేపట్టారు. గుడి నిర్మాణపు పనులను సంప్రదాయ బద్ధంగా చేస్తామని, సంతృప్తి వ్యక్తం చేశారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న బత్యాల చెంగల్‌రాయుడు

మెరుగైన వైద్య సేవలు అందించాలి : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డా.కృష్ణాస్ లైఫ్ హాస్పిటల్‌ను శుక్రవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బత్యాల చెంగల్‌రాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు. ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం ఆస్పత్రి యాజమాన్యం మాలేపాటి వెంకటరమణ నాయుడు, డాక్టర్ కృష్ణ, డాక్టర్ విన్యలు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మంచి వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. బత్యాల చెంగల్‌రాయుడు చేతుల మీదుగా ఆస్పత్రిని ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ పంటపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని కలికిరి-2 ఆర్‌బికె పరిధిలో గల రాజువారిపల్లి గ్రామంలో ఆర్‌బికె సిబ్బందికి వేరుశనగ పంటపై పొలంబడిపై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ సి.అన్నమయ్య, ఎడిఎ ఎంవి.శ్రీకాంత్, ఎఒ మమత రెడ్డి నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్‌బికె సిబ్బందికి శత్రు, మిత్రీ పురుగులను గుర్తించి వాటి ఉపయోగాల గురించి తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీని ప్రపంచ పశ్చిదాన్యాల దినోత్సవం సందర్భంగా పసి జాలి పంటలను సాగు చేసుకోవడం వలన తక్కువ నీరు, తక్కువ ఎరువులను ఉపయోగించి ఎక్కు పంటలను పండించవచ్చునని. అదేవిదంగా వరి పంటకు సాయంగా పప్పు జాతి పంటలు మరియు చిరుదాన్యాలను సాగుచేసి రైతులు మంచి ఆదాయాన్ని పొందాలని రైతులకు తెలియజేయడం జరిగినది. ఈకార్యక్రమంలో ఆర్ బి కె సిబ్బంది మరియు రైతులుపాల్గొనడం జరిగింది.



జెండా ఎగుర వేసి ఉరుసును ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఘనంగా ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-కలికిరి

హజరత్ ఖ్వాజా సయ్యద్ యూసూఫ్ అలీ భాధ్షా ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం అఫ మొహిద్దిన్ ఆధ్వర్యంలో హజ్రత్ సయ్యద్ షా ఘనంగా ప్రారంభించారు. ప్రముఖులు రానున్న నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేసారు. మొదట ముస్లిం ప్రజలతో కలిసి ఆయన జెండా ఎగురవేసి ఉరుసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహల్ గ్రామంలో శని, ఆదివారాలలో నిర్వహిస్తున్న హజరత్ క్వాజా సయ్యద్ యూసుఫ్ అలీ బాద్షా 175వ ఉరుసుకు ప్రముఖులు విచ్చేస్తున్నారని చెప్పారు. పెనుగొండ దర్గా పీఠాధిపతి తాజ్ బాబా, కడప పీఠాధిపతి హజరత్ ఖాజా సయ్యద్ షా ఆరీఫుల్లా హుసేని పాల్గొంటారని తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా ప్రతి ఒక్కరు ఉరుసు ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

జగనన్న ఇళ్లకు ఉచిత విద్యుత్ సర్వీసులు

ప్రజాశక్తి-పీలేరు

జగనన్న కాలనీల్లో పూర్తయిన ఇళ్ళకు ఉచిత విద్యుత్ సర్వీసులు ఇస్తున్నట్లు పీలేరు ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ఇండ్లకు విద్యుత్ సర్వీసులు పొందడానికి సంబంధిత మండల ఎఇని సంప్రదించి, లబ్ధిదారులు తమ ఇంటి పత్రాలు, ఆధార్ కాపీని సమర్పించాలని అన్నారు. ఎలాంటి నగదూ చెల్లించే అవసరం లేకుండా విద్యుత్ సర్వీసును పూర్తి ఉచితంగా పొందగలరని తెలిపారు. విద్యుత్ సర్వీసుకు సంబంధించిన మీటరు, మీటరు బోర్డు, సర్వీసు వైరు, ఇతర పరికరములు లబ్దదారుల ఇంటి వద్దకే తీసుకువచ్చి అమర్చుతారని చెప్పారు. మీటరు ఉచితంగా పొందడంలో లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలున్నా మండల ఎఇ కార్యాలయంలో కానీ, డివిజన్ కార్యాలయంలో తెలియజేస్తే వెంటనే సమస్య పరిష్కరించి, మీటరు అమర్చడం జరుగుతుందని పేర్కొన్నారు.



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి

బాలికల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

బాలికల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పీడీ మద్ది రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేసి పాఠశాలలో రికార్డులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, బోధనా తీరు, తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల వంటగది, స్టోర్ రూమ్, బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినీలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభ్యసనాస్థాయిని గుర్తించేందుకు పలు రకాల ప్రశ్నలతో సమాధానాలు రాబట్టారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, రక్తహీనత నివారణ, చేతుల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వ ఏర్పాట్లు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్లు, దిశ యాప్ ఆవశ్యతను ముఖ్యంగా బాలికలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆనంద్ కుమార్, ఎంఇఒ త్యాగరాజు, ప్రిన్సిపల్ హేమంత్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్వేత, ఎఎన్ఎం అమరావతి, టీచర్లు పాల్గొన్నారు. **ములకలచెరువు :** మండలంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర పిళ్ళై ప్రత్యేక అధికారిగా వసతి గృహంను తనిఖీ చేశారు. విద్యార్థులకు వ్యాధి నివారణ సూచనలు, వ్యక్తిగత ఆరోగ్యంపై వైద్య అధికారిణి డా.ఎస్ రేష్మ అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపల్ పి.కవిత మాట్లాడుతూ 100 శాతం ఉత్తీర్ణతకై విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల కుమారి, అంగన్వాడీ టీచర్ రమాదేవి, మహిళాపోలీస్ ఎన్.లలిత, ఎఎన్ఎంలు సరస్వతీ, అమరావతి, వార్డెన్ కవిత పాల్గొన్నారు. **కలకడ :** మండల కేంద్రం కలకడలోని ఆదర్శ పాఠశాలను జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణా నాయక్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో చదువు తున్న బాలికలు ఆకతాయిల పట్ల మోసపోకుండా జాగ్రత్తగా ఉండా లన్నారు. బాల్య వివాహాలు చేసుకోరాదని, ఇలాంటి సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటి కప్పుడు వారిని పర్యవేక్షించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. తక్కువ వయస్సులోనే పెళ్లి చేసుకొంటే ఎదురయ్యే సమస్యల గురించి అసిస్టెంట్ సిడిపిఒ మనిమంజరి తెలిపారు. కార్యక్రమంలో ఎడి పెద్ద వెంకయ్య, మెడికల్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, ఎంఇఒ మునీంద్రానాయక్, మహిళా పోలీస్ రజని, ప్రిన్సిపల్ మలంగుషావలి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధిగ్రస్తులకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

కుష్టు వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కిషోర్‌కుమార్ రెడ్డి కుష్టు వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి గ్రస్తులకు కాళ్ళు చేతులు ఒక బకెట్లో పెట్టి బాగా నానిన తర్వాత గరుకురాయితో శుభ్రం చేయుట వలన వారి చర్మం మృదువుగా ఏర్పడు తుందని, అలాగే ఆయిలింగ్ కూడా చేసుకో వచ్చునని తెలిపారు. ఇలా రోజు మార్చి రోజు చేసుకోవడం వల్ల పుండ్లు, గాయాలు కాకుండా ఉంటుంది. వారికి కావలసిన కట్టుగుడ్డ, బ్యాండేజి క్లాత్, కావలసిన మందులు ఇచ్చి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.జయరామయ్య, ఎంపిహెచ్ఇ సుబ్బరత్న, పిహెచ్ఎన్, సూపర్వైజర్లు, ముజీబ్ బాషా, బి.రెడ్డమ్మ, స్టాఫ్‌నర్స్ భారతమ్మ, ఆరోగ్య కార్యకర్త ఎన్.వాణి ఆశా కార్యకర్తలు గురు శాంత, అలివేలుమంగ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : 'గడికోట'

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారంచిన్నమండెం మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే, జడ్పి మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి లు చర్చించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు నేరుగా అందాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం లో వచ్చిన సమస్యలు, చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. అభివృద్ధి, నిర్మాణ పనులలో వేగం పెంచాలని, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జులేఖ బేగం

గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గర్భిణులు వైద్యుల సూచనలు తప్పక పాటించి, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ జులేఖ భేగం అన్నారు. శుక్రవారం స్థానిక పిహెచ్ సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 9,10వ తేదీలలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, హైరిస్క్ గర్భవతులను, రక్తహీనత కలిగిన గర్భిణులను ముందుగా గుర్తించడం జరుగుతుందన్నారు. వీరికి వైద్యులు ప్రత్యేకమైన వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. వైద్య పరీక్షలకు 74 మందిహాజరు కాగా 22 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించడం జరిగిందన్నారు. రక్తహీనత కలిగిన వారికి ఐరన్ సుక్రోచ్ ఐవి ఇంజెక్షన్లను ఇచ్చినట్లు తెలిపారు. ఆకుకూరలు, కోడిగ్రుడ్డు, పాలు వంటి ఆరోగ్యకరమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ జే.సరోజ, హెల్త్ సూపర్వైజర్ ఏ.దేవకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముళ్ల కంప తొలగింపు

ప్రజాశక్తి-ములకలచెరువు



ముళ్ల చెట్లను తొలగిస్తున్న జెసిబి

మండలంలోని టి.సదుం పంచాయతీ గుంటి పల్లె వద్ద ఉన్న తుమ్మల చెరువు కట్టపై ఉన్న ముళ్ల చెట్లను శుక్రవారం తొలగించారు. చెరువు కట్టపై ముళ్లచెట్లు పెరగడంతో చెరువు ప్రమాదకరస్థాయికి చేరుకుంటుందని గ్రామస్తులు స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుక వచ్చారు. సర్పంచ్ పంచాయతీ అధికారులతో చర్చించి జెసిబితో ముళ్ల చెట్లను తొలగించే పనులను చేపట్టారు

క్రైం కార్నర్

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓ దొంగతనం కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించారు. ఈ మేరకు నింధితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మొత్తం నగలు స్వాధీనం చేసుకున్నట్లు రాయచోటి డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. డిఎస్‌పి కథనం మేరకు.. మండలంలోని మూరేవాండ్లపల్లి పంచాయతీ పెద్దవంకపల్లి గ్రామంకు చెందిన మదగాని ఈశ్వరయ్య, తల్లి పద్మావతమ్మ ఇంటికి తాళాలు వేసుకొని, బయటకు వెళ్లారు. గమనించిన కలకడ మండలం ముడియంవారిపల్లికి చెందిన చింతపర్తి వెంకటరమణ రెడ్డి ఇంటి కిటికిలో ఉంచిన తాళం చెవితో ఇంటి బీగాలు తీసి, బీరువాలో ఉన్న సుమారు 145 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలించుకొని పోయాడు. ఇంటికి వచ్చి చూసిన ఈశ్వరయ్య ఇంట్లో దొంగతనం జరిగిందని జనవరి 20వ తేది వాల్మీకిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వాల్మీకిపురం ఎస్ఐ బిందుమాధవి కేసు నమోదు చేసి, సిఐ బి.ఎన్.సురేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, డిఎస్‌పి శ్రీధర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ దర్యాప్తులో కలికిరి టౌన్ సత్యారెడ్డివీధిలో నిందితుడు ఉండగా సిఐ సిబ్బందితో కలసి అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.6.54లక్షలు విలువ చేసే 145.450 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన సిఐ, ఎస్ఐ బిందుమాధవి, కలికిరి ఎఎస్ఐ మధుసూదనచారి, సిబ్బందిని ఎస్‌పి, డిఎస్‌పిలు అభినందించారు.



దొంగతనం కేసులో నిందితుడు, నగలను చూపుతున్న డిఎస్‌పి శ్రీధర్